సాక్షి విజయనగరం

ఆదివారం । 5 । ఫిబ్రవరి । 2023



నేడు ఎస్‌పీఎల్ సెమీఫైనల్ మ్యాచ్‌లు

స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న 'సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్)' క్రికెట్ పోటీల్లో భాగంగా శనివారంతో నాకౌట్ పోటీలు ముగిశాయి. - 8లో



ఆదిత్యుని సేవలో ఎస్పీ దంపతులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని విజయనగ రం చింతలవలస ఐదో బెటాలియన్ ఎస్పీ విక్రాంత్ పాటిల్, జిల్లా ఎస్పీ ఎం.దీపికాపాటిల్ దంపతు లు శనివారం దర్శించుకున్నారు.



గురుకుల విద్యార్థులకు పతకాలు

బొబ్బిలి గురుకుల పాఠశాల విద్యార్థులు కె.చంద్ర మౌళి, డి. ధనుష్‌నాయుడు అనకాపల్లిలో గతనెల 30న జరిగిన రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో వెండి, రజత పతకాలు సాధించారు. వీరిని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.కృష్ణ, వెంకటరమణ అభినందించారు.

న్యూస్‌రీల్

ఆరోగ్యశ్రీ సేవల్లో విజయనగరం ఫస్ట్

- 3 నెలల వ్యవధిలో 26,869 మంది రోగులకు సేవలు
- ఫీడ్‌బ్యాక్ తీసుకోవడంలోనూ ప్రథమమే..



ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స పొందుతున్న రోగులు

విజయనగరం ఫోర్ట్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద రోగులకు వైద్య సేవలు అందించడంలో జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. 3 నెలల వ్యవధిలో 26,869 మంది రోగులకు వైద్య సేవలు అందించడంతో గుర్తింపు లభించింది. అలాగే, రోగుల ఫీడ్‌బ్యాక్ తీసుకోవడంలోనూ జిల్లా ముందంజలో నిలిచింది. 26,053 మంది రోగులకు ఫీడ్ బ్యాక్ లెటర్లు పంపించగా, అందులో 23,170 మంది నుంచి తిరిగి ఫీడ్‌బ్యాక్ లెటర్లు తీసుకున్నారు. జిల్లాలో 30 వరకు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు, 48 పీహెచ్‌సీల్లో ఆరోగ్యశ్రీ పథకం సేవలు అందుతున్నాయి.

11,12 తేదీల్లో చెస్ క్రీడాకారుల ఎంపికలు

విజయనగరం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అండర్-15 బాల, బాలికల పోటీల్లో తలపడే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలను ఈనెల 11,12 తేదీల్లో నిర్వహిస్తామని అసోసియేషన్ కార్యదర్శి కె.వి.జ్వాలాముఖి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా రోజుల్లో ఉదయం 9 గంటల నుంచి నగరంలోని తోటపాలెం ఫైర్ చెస్ స్కూల్‌లో పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో 2008 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించిన వారు మాత్రమే పాల్గొనేందుకు అర్హులని, విధిగా తమ వయస్సు ధ్రువీకరణ పత్రాన్ని వెంట తీసుకురావాలని సూచించారు. జిల్లా జట్టుకు ఎంపికైన నలుగురు బాలురు, నలుగురు బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 94909 48730 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

టిడ్కో ఇళ్లను సందర్శించిన జమ్మాన



టిడ్కో గృహ సముదాయాలను పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, అధికారులు, లబ్ధిదారులు

విజయనగరం గంటస్తంభం: విజయనగరం పరిధిలోని సారిపల్లి, సోనియానగర్‌లలో నిర్మించిన టిడ్కో గృహసముదాయాలను టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ లబ్ధిదారులతో కలిసి శనివారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులు, మౌలిక వసతులపై ఆరా తీశారు. 2,976 ఇళ్లను మార్చినాటికి పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట టిడ్కో సూపరింటెండెంట్ ఇంజినీర్ నరసింహమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జ్యోతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాలకృష్ణ, సీఎల్టీసీ శ్రీనివాసరావు, మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'రెండు ఆకాశాల మధ్య' పుస్తకావిష్కరణ నేడు

విజయనగరం టౌన్: ప్రముఖ రచయిత సలీం రచించిన 'రెండు ఆకాశాల మధ్య' నవలను ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో మాజీ ఎంపీ డాక్టర్ డీవీజీ శంకరరావు ఆవిష్కరించనున్నట్లు సహజ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు ఎన్కే బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహిత్యాభిమానులందరూ హాజరుకావాలని కోరారు.

భక్త తీర్థం..!

- వైభవంగా రాములోరి రథయాత్ర
- రామతీర్థం తిరు వీధుల్లో ఊరేగిన సీతాసమేతరామస్వామి
- ఆకట్టుకున్న పండిత పరిషత్



రథంపై ఊరేగుతున్న రాములోరు



స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ



భక్తజనం నడుమ సాగుతున్న స్వామివారి రథయాత్ర, (ఇన్‌సెట్లో) మహిళల కోలాట ప్రదర్శన

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం శనివారం రామనామస్మరణతో మార్మోగింది. భక్తుల జయజయ ధ్వానాలు, మహిళల కోలాట ప్రదర్శనలు, మంగళవాయిద్యాలతో స్వామివారి రథయాత్ర వైభవంగా సాగింది. తిరుక్కల్యాణం అనంతరం మూడో రోజు నిర్వహించిన రథయాత్రను తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చారు. అర్చకులు స్వామి వారికి ఉదయం గ్రామబలిహరణం చేపట్టి శ్రీరాముడి సన్నిధిలో శ్రీమద్రామాయణ పారాయణం, వేదపఠనం, వైదిక సదస్యం తదితర కార్యక్రమాలను జరిపించారు. సాయంత్రం 6 గంటలకు వేద పండితులంతా పండిత పరిషత్‌ను నిర్వహించి వేదాలను భక్తి శ్రద్ధలతో పఠించారు. స్వామివారి విశేషాన్ని వివరిస్తూ ఉత్సవవిగ్రహాలను ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేక రథంపై ఆశీనులు చేసి పూజలు జరిపారు.

రథంపై రాములోరు...

వేద పండితుల వేదమంత్రోచ్చరణ నడుమ సీతా రామ లక్ష్మణులు రామతీర్థం పురవీధుల్లో ఊరేగి వేలాది మంది భక్తులకు కనువిందు చేశారు. మూడు గంటల పాటు జరిగిన రథయాత్ర మహోత్సవంతో రామతీర్థం పులకించింది. ఆలయ ప్రతిష్ట జరిగిన నాటి నుంచి ఆనవాయితీగా వస్తోన్న సీతారామునిపేట, జగ్గరాజు గ్రామస్తులు రథాన్నిలాగి యాత్రను ప్రారంభించారు. స్వామివారి ఊరేగింపునకు ముందు పండిత పరిషత్ వైభవంగా జరిగింది. సీతారాముల గుణగణాలను తెలియపర్చేందుకు వేదపండితులు పోటీపడిన సన్నివేశం భక్తులను ఆకట్టుకుంది. వేద పండితులను దేవస్థానం తరుపున ఘనంగా సన్మానించారు.

కుటుంబ సమేతంగా..

విజయనగరం, నెల్లిమర్ల ప్రాంతాలతో పాటు ఏటీ అగ్రహారం, దన్నానపేట, తంగుడుబిల్లి, గొర్లిపేట, కొత్తపేట, సతివాడ, రామతీర్థం, ఒమ్మి, తదితర పరిసర గ్రామాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి రథయాత్రను తిలకించారు. పూజా సామగ్రిని రథంపైకి విసిరి స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రథయాత్ర ముగిసిన తర్వాత ఆలయానికి 150 మీటర్ల దూరంలో రథం ఇరుసులు దెబ్బతినడంతో ఉత్సవ విగ్రహాలను పల్లకిపై తీసుకెళ్లారు. రథయాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈఓ ప్రసాదరావు ఆధ్వర్యంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు, కిరణ్, పవన్‌కుమార్ రథయాత్రను ముందుండి నడిపించారు.

మాటతప్పని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి



వంతెన రూట్ మ్యాప్ పరిశీలిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- బలసలరేవు వంతెన మ్యాప్‌ను పరిశీలించిన స్పీకర్ తమ్మినేని

రాజాం/సంతకవిటి: మాటతప్పని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సంతకవిటి మండలం వాల్తేరు బలసలరేవు వద్ద నాగావళి నదిపై నిర్మించనున్న వంతెన రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. వంతెన కాంట్రాక్టు దక్కించుకున్న కాంటాక్ట్ సిండికేట్ కంపెనీ యజమాని విశ్వేశ్వరరావుతో పాటు ఆర్అండ్‌బీ ఈఈ రవినాయక్, డీఈఈ జాన్‌విక్లిప్‌లు వద్ద వివరాలు సేకరించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసంకల్పయాత్రలో నియోజకవర్గాల వారీగా సమస్యలు తెలుసుకుని అధికారంలోకి వచ్చినవెంటనే వాటన్నింటినీ పరిష్కరిస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే ఆ రోజు ఆమదాలవలస నియోజకవర్గంలో బలసలరేవు వంతెన ప్రస్తావన వచ్చిందని, ఇప్పుడు నెరవేరుతోందని చెప్పారు. విశ్వసనీయత కలిగిన ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఖ్యాతి గడించారన్నారు. ప్రజల ముందు నిలబడి ఆడిన మాటను బైబిల్, ఖురాన్, భగవద్గీతలు కంటే ఎక్కువగా పాటిస్తారని తెలిపారు. అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి నారాయణపురం ప్రాజెక్టుకు రూపకల్పనచేసి, వేలాది ఎకరాలు సస్యశ్యామలం చేసి ప్రజలు మనస్సులో నిలిచిపోయారని, ఈ రోజు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 50 గ్రామాల ప్రజల రవాణా కష్టాలను తీర్చడంతో పాటు తరతరాల నాటి కలను నెరవేర్చుతున్నారన్నారు. రూ.87 కోట్ల ఖర్చుతో 16 పిల్లర్లతో ఈ ఏడాది చివరి నాటికి వంతెన నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. వంతెన శంకుస్థాపన పనులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానించినట్టు వెల్లడించారు. రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ ఒక వ్యక్తిత్వం ఉన్న నేత అని, వంతెన మంజూరుకు ఎంతో సహకరించారని తెలిపారు. ఎమ్మెల్యే కంబాల జోగులు సమయం దొరికినప్పుడల్లా వంతెన కోసం ప్రయత్నించారని, పట్టుబట్టి వంతెన సాధనకు కృషిచేశారన్నారు. వంతెన నిర్మాణానికి ఇటు 6.39 ఎకరాలు, అటు 7.12 ఎకరాల భూమి అవసరమని, రైతులు సహకరించాలని కోరారు. భూములిచ్చిన రైతులకు సకాలంలో నష్టపరిహారం అందిస్తామన్నారు.

- ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణాన్ని విస్మరించిందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వంతెన సాకారం కావడం ఆనందంగా ఉందన్నారు. వంతెన సాధనలో వాల్తేరు, పరిసర గ్రామాల పెద్దల పట్టుదల ఎంతో గొప్పదని పేర్కొన్నారు. అనంతరం జెడ్పీ వైస్‌చైర్మన్ సిరిపురపు జగన్‌మోహనరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ గురుగుబెల్లి స్వామినాయుడు, వైఎస్సార్ సీపీ పొందూరు మండల కన్వీనర్ పప్పల రమేష్ తదితరులు మాట్లాడారు. పొందూరు జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, కిల్లి నాగేశ్వరరావు, వైస్‌ఎంపీపీ వండాన వెంకటరావు, సంతకవిటి పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి గవరయ్య, వంతెన సాధన కమిటీ చైర్మన్ గురుగుబెల్లి నారాయణరావు, సీనియర్ సర్పంచ్ జోల తిరుపతి, ఆర్అండ్‌బీ ఏఈ ఆంజనేయలనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మా ప్రాదేశికాన్ని శ్రీకాకుళంలో విలీనం చేయండి

వాల్తేరు ఎంపీటీసీ ప్రాదేశిక స్థానాన్ని శ్రీకాకుళం జిల్లాలో కలపాలని వాల్తేరు గ్రామానికి చెందిన కొంతమంది స్పీకర్ తమ్మినేని సీతారాంకు విన్నవించారు. వాల్తేరు ప్రాదేశికంలో మూడు గ్రామాలు ఉన్నాయని, శ్రీకాకుళానికి దగ్గరగా ఇవి ఉన్నందున వీటిని ఆ జిల్లాలో కొనసాగించే ఏర్పాట్లు చేయాలని కోరారు. ఇక్కడ కొత్తగా నిర్మిస్తున్న వంతెనకు తమ్మినేని వంతెన అని నామకరణం చేయాలని కోరారు.

వేడుకగా అమ్మవారి జాతర నిర్వహిద్దాం

- తేదీలు వెల్లడించిన జెడ్పీ చైర్మన్, ఎంపీ, ఆలయ కమిటీ
- ఫిబ్రవరి 26, 27,28 తేదీల్లో కనకమహలక్ష్మి జాతర



కనకమహలక్ష్మి అమ్మవారి జాతర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్, ఎంపీ, ఆలయ కమిటీ ప్రతినిధులు

చీపురుపల్లి: భక్తుల కొంగుబంగారం చీపురుపల్లి కనకమహలక్ష్మి అమ్మవారి 25వ జాతర మహోత్సవాలను అందరి సహకారంతో వేడుకగా నిర్వహించుకుందామని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పేర్కొన్నారు. అమ్మవారి దేవస్థానం వద్ద ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద నేతృత్వంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో 25వ జాతర మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 26, 27, 28 తేదీల్లో అమ్మవారి జాతర వైభవోపేతంగా నిర్వహిస్తామన్నారు. ఏటా మహాశివరాత్రి పర్వదినం తరువాత వచ్చే ఆదివారం నుంచి అమ్మవారి జాతర నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది మహాశివరాత్రి తరువాత వచ్చే ఆదివారం అమావాస్య కావడంతో తరువాత ఆదివారం నుంచి జాతర ప్రారంభమవుతుందన్నారు. జాతర నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. మరికొద్ది రోజుల్లో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో జాతర సన్నాహక సమావేశం నిర్వహించుకుందామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ సూరుకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, దన్నాన జనార్దనరావు, మంగళగిరి శ్రీనివాసరావు, పతివాడ రాజారావు, ఇప్పిలి తిరుమల, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.సంజీవరావు, ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు, దేవదాయశాఖ ఈఓ జి.శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు రవిశర్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా ఆరు సహకార బ్యాంకులు



విలేకరులతో మాట్లాడుతున్న డీసీసీబీ సీఈఓ జనార్దన, పక్కన చైర్మన్ చినరామునాయుడు, తదితరులు

- డీసీసీబీ సీఈఓ కె.జానార్దన
- మార్చినాటికి రూ.2వేల కోట్ల లావాదేవీలు
- సేవారుసుం లేకుండా ఖాతాదారులకు సేవలు
- 1877 డ్వాక్రా గ్రూపులకు 100 కోట్ల రుణాలు

వేపాడ: జిల్లాలో మార్చి నాటికి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో ఆరు కొత్త బ్రాంచిలు ఏర్పాటు చేయనున్నట్టు బ్యాంకు ముఖ్య కార్య నిర్వహణాధికారి కె.జనార్దన తెలిపారు. డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు ఆధ్వర్యంలో వేపాడలో సహకార బ్యాంకు ఏర్పాటుకు అనువైన భవనాలను, కో.ఆపరేటివ్ సొసైటీ భవనాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో వేపాడ, మెరకముడిదాం, దత్తిరాజేరు, భోగాపురం, మెంటాడ మండలం చల్లపేట, పార్వతీపురం మన్యం జిల్లాలోని గరుగుబిల్లిలో కొత్త బ్రాంచ్‌లు ప్రారంభిస్తామని చెప్పారు. సహకార బ్యాంకుకు ఆర్‌బీఐ లైసెన్స్ కలిగి ఉందన్నారు. మార్చినాటికి రూ.2వేల కోట్ల లావాదేవీలు సాధిస్తుందన్నారు. జిల్లాలోని 1877 స్వయం సహాయక సంఘాలకు, 303 ఎఫ్‌పీజీ గ్రూపులకు సుమారు రూ.100కోట్ల రుణాలు అందజేసినట్టు వెల్లడించారు. సహకార మిత్ర పేరుతో పంట రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో షేక్ క్యాపిటల్‌కు సంబంధించి ఖాతాదారులకు ఆరున్నర కోట్లు చెల్లించినట్టు తెలిపారు. గృహ, వాహన రుణాలను తక్కువ వడ్డీకే అందజేస్తున్నామన్నారు. బంగారు ఆభరణాలపై తక్షణ రుణాలు మంజూరు చేస్తున్నామని చెప్పారు. సహకార బ్యాంకులో ఎటువంటి సేవా రుసుం ఉండదన్నారు. చిరువ్యాపారులకు రూ.50వేలు వరకు రుణం అందజేస్తామన్నారు. సహకార నిధి పేరుతో 999 రోజులకు సాధారణ వ్యక్తులకు 8 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం వడ్డీతో చెల్లిస్తున్నామని తెలిపారు. పంట రునాలు 3 లక్షలలోపు 7శాతం, 3 నుంచి 5 లక్షలవరకు 8 శాతం, ఐదు లక్షలు పైబడి రుణానికి 9 శాతం వడ్డీ వసూలు చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు ఏజీఎమ్ లక్ష్మణరావు, కొత్తవలస బ్రాంచి సిబ్బంది బి.అచ్చుతరావు, పద్మనాభం, చినగుడిపాల సర్పంచ్ రామునాయుడు, నీలకంఠరాజపురం ఉప సర్పంచ్ కె.పెదనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మూగబోయిన వాణి

- కళాభిమానుల కన్నీటి నివాళి
- జిల్లాలో ఆత్రేయ పురస్కారం అందుకున్న వాణీజయరాం
- అయోధ్యా మైదానంలో సంగీత ఉత్సవంలో పాల్గొన్న గాయని



రోటరీ కాన్ఫరెన్స్‌లో వాణీజయరాం కార్యక్రమానికి వ్యాఖ్యాతగా ఉన్న కాపుగంటి ప్రకాష్



మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ కోలగట్ల చేతుల మీదుగా ఆత్రేయ పురస్కారాన్ని అందుకుంటున్న వాణీజయరాం (ఫైల్)

విజయనగరం టౌన్: కళాతపస్వికి కన్నీటి వీడ్కోలు పలికిన కొద్ది గంటల్లోనే.. ఆమె నోటివెంట ఆనతి నియ్యరా హరా... అని పలికించిన ఆయన వెంటే వెళ్లిపోయిన గాయని వాణీజయరాం... సంగీత అభిమానులను శోకసంద్రంలో ముంచారు. ఆమె గళం తెలుగు ప్రజలకు ఓ వరం. ఎప్పటివలె కాదురా స్వామి, ఎన్నెన్నో జన్మల బంధం, ఒక బృందావనం.. వంటి మధుర గీతాలను ఆలపించి శ్రోతలను మైమరిపించారు. అద్భుతమైన గానామృతంతో తెలుగు వారంతా మెచ్చుకునేలా పాటలు పాడారు. ఆమెకు విజయనగరంతో ఉన్న అనుబంధం అపురూపమైనది. ఆత్రేయ కళాపీఠం ఆత్రేయ పురస్కారాన్ని అందించి ఆమెను ఘనంగా సత్కరించింది.

- విజయనగరంలో 2005 మే 7న మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేతుల మీదుగా ఆత్రేయ పురస్కారాన్ని వాణీజయరాం అందుకున్నారు. పురస్కారం అందుకున్న తర్వాత 'దేవతలు నడయాడిన నేల విజయనగరమని, ఇది కళల కాణాచి అని... వాణీ వీణానాద సారం విజయనగరమని, అందుకేనేమో నా తల్లిదండ్రులు వాణీ అని తనకు పేరు పెట్టారని... కవులకు, కళాకారులకు పుట్టింట తననో ఆడబిడ్డగా తలిచి సోదరుడు గంటి మురళి ఈ ఆత్రేయ పురస్కారం అశేష జనవాహిని మధ్య తనకివ్వడం తన పూర్వజన్మసుకృతమని' పేర్కొన్నట్టు కళాపీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళి గుర్తుచేసుకున్నారు. తెలుగులో అనర్గళంగా 45 నిమిషాలు మాట్లాడి డాక్టర్ తిరుమల ప్రసాద్ ఇంట ఆతిథ్యం జన్మజన్మకు మరిచిపోనని, రాత్రి 12 అవుతున్నా ఏ ఒక్కరూ కదలని మీ సంస్కారానికి శిరసు వంచుతున్నానని తెలిపారన్నారు. నిజంగా నిన్న విశ్వనాథ్, నేడు వాణీజయరాంలు ఒక్కరోజు తేడాలో కాలం చేయడం మనసును కలిచివేసిందని వాపోయారు. ఆమె మృతికి సంతాపం తెలియజేశారు.
- 2008లో మద్రాస్ తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో అయోధ్యా మైదానంలో మూడురోజుల పాటు నిర్వహించిన సంగీత ఉత్సవంలో ఆమె పాల్గొన్నారు. తనను సొంతసోదరునిలా భావించేవారని, విజయవాడ రోటరీ కాన్ఫరెన్స్‌లో జరిగిన వాణీజయరాం మ్యూజికల్ నైట్‌తో పాటు మూడుసార్లు వారి మ్యూజిక్ నైట్లకు వ్యాఖ్యాతగా నిర్వహించే అవకాశం తనకు కలగడం మరిచిపోలేనిదని గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రధానకార్యదర్శి కాపుగంటి ప్రకాష్ గుర్తుచేసుకున్నారు. ఆమె మృతి కళారంగానికే తీరనిలోటన్నారు.

క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్ సీనియర్ బాలికల జట్టు కోచ్‌గా తిరుపతి



పల్ల తిరుపతి

తెర్లాం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ సీనియర్ బాలికల జట్టు కోచ్‌గా తెర్లాంకు చెందిన పల్ల తిరుపతి ఎంపికై నట్లు ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5 నుంచి 9 వరకు ఒడిశా రాష్ట్రంలోని పూరీలో జాతీయ స్థాయి సీనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న రాష్ట్ర జట్టుకు కోచ్‌గా తిరుపతిని రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఎంపిక చేసింది. సాఫ్ట్‌బాల్ క్రీడలో తిరుపతి జాతీయ స్థాయి సీనియర్ క్రీడాకారునిగా, జిల్లా, రాష్ట్ర జట్టుకు కోచ్‌గా వ్యవహరించాడు. కోచ్‌గా తిరుపతి ఎంపిక కావడం పట్ల పలువురు క్రీడాకారులు, పీడీలు, పీఈటీలు హర్షం వ్యక్తం చేశారు.

వరి కుప్పల దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

రేగిడి: మండల పరిధిలోని మజ్జిరాముడుపేట గ్రామంలో శనివారం పలువురు రైతులకు చెందిన వరికుప్పలు దగ్ధమయ్యాయి. కళ్లాల్లో వరి పంటను యంత్రంతో నూరుస్తున్న సమయంలో గడ్డి పరకలు పైకి ఎగిరి విద్యుత్ వైర్లకు తగలడంతో నిప్పులు రాలి గ్రామానికి చెందిన కొమ్ము ఎరుకునాయుడు, కొమ్ము దాలినాయుడు, కొమ్ము బాగినాయుడు, కోసూరు రాజన్న, కొమ్ము వెంకటరమణలకు చెందిన మూడు ఎకరాల వరి కుప్పలు కాలిపోయాయని వీఆర్వో గోపాలరావు, వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ, వీఏఏ వినీత తెలిపారు. పాలకొండ ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందొచ్చిన సమయంలో కాలిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

నేడు ఎస్‌పీఎల్ సెమీఫైనల్ మ్యాచ్‌లు

- జూనియర్ విభాగంలో తలపడనున్న భాస్కర్ జూనియర్ కళాశాల- పీఎస్ఎం వాసవి జూనియర్ కళాశాల జట్లు
- సీనియర్ విభాగంలో సెమీస్‌కు చేరిన ఎంవీజీఆర్, సీతం ఇంజినీరింగ్, జేఎన్‌టీయూ జీవీ, మిరాకిల్ కళాశాల జట్లు



సీతం కాలేజీ, లెండీ కాలేజీ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్



సెమీస్‌కు చేరిన ఎంవీజీఆర్ కళాశాల జట్టు



విజయం సాధించిన సీతం కళాశాల జట్టు



సెమీస్‌కు చేరిన జేఎన్‌టీయూ జీవీ జట్టు



విజయం సాధించిన మిరాకిల్ జట్టు

విజయనగరం రూరల్: స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న 'సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్)' క్రికెట్ పోటీల్లో భాగంగా శనివారంతో నాకౌట్ పోటీలు ముగిశాయి. సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో సీనియర్ విభాగంలో ఎంవీజీఆర్, సీతం ఇంజినీరింగ్, జేఎన్‌టీయూ జీవీ, మిరాకిల్ కళాశాల జట్లు నాకౌట్ మ్యాచ్‌ల్లో విజయం సాధించి సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాయి. ఆదివారం ఎంవీజీఆర్ జీవీ- జేఎన్‌టీయూ జీవీ కళాశాల జట్ల మధ్య తొలి సెమీఫైనల్ మ్యాచ్, మిరాకిల్ ఇంజినీరింగ్ జట్టు- సీతం ఇంజినీరింగ్ జట్ల మధ్య రెండో సెమీఫైనల్ మ్యాచ్ జరగనుంది. జూనియర్ విభాగంలో భాస్కర్ జూనియర్ కళాశాల - పీఎస్ఎం వాసవి జూనియర్ కళాశాల జట్ల మధ్య రెండో సెమీఫైనల్ మ్యాచ్ జరగనుంది. సెమీఫైనల్లో ఎంవీజీఆర్, మిరాకిల్, జేఎన్‌టీయూ జీవీ, సీతం ఇంజినీరింగ్ జట్లు సీనియర్స్ విభాగంలో శనివారం జరిగిన నాకౌట్ మ్యాచ్‌ల్లో ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల - అవంతి సెయింట్ థెరిస్సా కళాశాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఎంవీజీఆర్ కళాశాల జట్టు 32 పరుగుల తేడాతో గెలుపొందింది. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎంవీజీఆర్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 87 పరుగులు సాధించింది. అనంతరం 88 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన అవంతి ఇంజినీరింగ్ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 52 పరుగులు మాత్రమే సాధించి 32 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఈ విజయంతో ఎంవీజీఆర్ జట్టు సెమీఫైనల్స్‌కు చేరింది.

సీతం విజయదుందుభి

లెండి ఇంజినీరింగ్ కళాశాల జట్టు - సీతం ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సీతం కళాశాల జట్టు 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచిన లెండి ఇంజినీరింగ్ కళాశాల జట్టు ముందుగా బ్యాటింగ్ చేపట్టి నిర్ణీత 10 ఓవర్లలో 73 పరుగులకు ఆలౌటైంది. అనంతరం 74 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన సీతం కళాశాల జట్టు 8.5 ఓవర్లలో కేవలం ఒక వికెట్ కోల్పోయి 74 పరుగులు చేసి 9 వికెట్ల తేడాతో గెలుపొంది సెమీఫైనల్‌కు అర్హత సాధించింది.

జేఎన్‌టీయూ జైత్రయాత్ర

జేఎన్‌టీయూ జీవీ, అవంతి జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో జేఎన్‌టీయూ తన జైత్రయాత్రను కొనసాగించింది. ముందుగా టాస్ గెలిచి జేఎన్‌టీయూ జీవీ బౌలింగ్ ఎంచుకోగా అవంతి జట్టు బ్యాటింగ్ చేపట్టి నిర్ణీత 10 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 77 పరుగులు సాధించింది. అనంతరం 78 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన జేఎన్‌టీయూ జీవీ జట్టు 8.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 78 పరుగుల విజయ లక్ష్యాన్ని అందుకుని సెమీఫైనల్‌కు చేరుకుంది.

మిరాకిల్ భారీ స్కోర్

మిరాకిల్, అవంతి రీసెర్చ్ కళాశాల జట్ల మధ్య మధ్యాహ్నం నిర్వహించిన రెండో మ్యాచ్‌లో మిరాకిల్ జట్టు 115 పరుగుల భారీ స్కోర్ సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మిరాకిల్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 115 పరుగులు సాధించింది. అనంతరం 116 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన అవంతి కళాశాల జట్టు 9.3 ఓవర్లలో 96 పరుగులకు ఆలౌటై 19 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఈ విజయంతో మిరాకిల్ జట్టు సెమీఫైనల్‌కు చేరుకుంది.

నేటి మ్యాచ్‌ల షెడ్యూల్

సీనియర్స్ విభాగంలో...

ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ జట్టు – జేఎన్‌టీయూ జీవీ కళాశాల జట్టు

మిరాకిల్ ఇంజినీరింగ్ జట్టు – సీతం కళాశాల

జూనియర్ విభాగం సెమీఫైనల్స్ మ్యాచ్

రెండో సెమిస్: భాస్కర్ జూనియర్ కళాశాల – వాసవి పీఎస్ఎం కళాశాల

SAKSHI | SAKSHI DIGITAL | MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

త్వరలోనే పైడితల్లి ఆలయ అభివృద్ధి పనులకు అంకురార్పణ

- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- ఆలయ సమీప దుకాణాలు, గృహ యజమానులకు చెక్కుల అందజేత



ఆలయ సమీప దుకాణాలు, గృహ యజమానులకు చెక్కులు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: సాంకేతిక ప్రక్రియలు పూర్తయిన వెంటనే పైడితల్లి ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. మార్చి నెల ప్రారంభం నాటికి సమీపంలోని దుకాణాలను ప్రత్యామ్నాయ ప్రాంతానికి తరలించి సంబంధిత అభివృద్ధి పనులకు అంకురార్పణ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో శనివారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. పైడితల్లి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే పలు దఫాలు కమిటీ సభ్యులు సమావేశమయ్యారని, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారని వెల్లడించారు. దేవదాయ శాఖ రాష్ట్ర స్థాయి అధికారులతో కూడా మాట్లాడామని.. ఈ మేరకు ఆలయ సమీపంలోని దుకాణాలు, గృహ యజమానులకు ఆర్థిక పరిహారం అందజేసేందుకు, వారి దుకాణాలను ప్రత్యామ్నాయ చోటుకు తరలించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆలయాన్ని విస్తరించటం ద్వారా భవిష్యత్తులో భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవన్నారు. సులభంగా దర్శన భాగ్యం లభిస్తుందన్నారు. అభివృద్ధి చర్యల్లో భాగంగా మార్చి ఒకటో తేదీ నాటికి సమీపంలోని యజమానులు వారి భవనాలను అప్పగించనున్నారని తెలిపారు. అనంతరం సంబంధిత అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని డిప్యూటీ స్పీకర్ పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సంపూర్ణ సహకారం అందించారని, ఆలయ కమిటీ సభ్యుల ప్రత్యేక చొరవ తీసుకున్నారని వీరభద్రస్వామి గుర్తు చేశారు.

చెక్కుల అందజేత

ఆలయ అభివృద్ధికి స్థలాలు ఇచ్చిన దుకాణాలు, గృహ యజమానులకు డిప్యూటీ స్పీకర్ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. శనివారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భాగంగా యజమానులు వెంకటేశ్వరరావుకు రూ.11 లక్షలు, కృష్ణప్రియకు రూ.4.35 లక్షల విలువ గల చెక్కులను స్వామి అందజేశారు. సమావేశంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కిషోర్‌కుమార్, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, దేవస్థానం పాలక మండలి సభ్యులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు యవర్ణ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేర విచారణలో వైద్యుల నివేదిక కీలకం



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికల్యాణ చక్రవర్తి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ చక్రవర్తి

విజయనగరం లీగల్: వైద్యులు చేసే క్రిమినల్ ఇన్విస్టిగేషన్ ఎవిడెన్స్ రిపోర్టులు అత్యంత కీలకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. జిల్లా కోర్టు సముదాయంలో న్యాయ సేవా సదన్‌లో నల్సా వారి సహకారంతో క్రిమినల్, ఇన్విస్టిగేషన్, ఎవిడెన్సు రిపోర్టులపై వైద్యులు, వైద్యాధికారులకు, ప్రొఫెసర్లకు శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ నేర విచారణ, సాక్ష్యాల నివేదికలను రూపొందించే విషయంలో అవగాహన కల్పించారు. వైద్యులు ఇచ్చే నివేదికల పైనే న్యాయమూర్తి ఇచ్చే తుది తీర్పులు ఆధారపడి ఉంటాయని స్పష్టం చేశారు. డాక్టర్లు ఇచ్చే నివేదికలు, కేసు పూర్వాపరాలను అనుసరించి, న్యాయమూర్తులు తీర్పులను ఇస్తారని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పు చేసిన వారు బయట తిరగకూడదని, కేసు, శిక్ష నుంచి తప్పించుకోకూడదని స్పష్టం చేశారు. నేర విచారణ, రిపోర్టులు ఇచ్చే విషయంలో డాక్టర్లు పూర్తి భాగస్వాములై ఉండాలన్నారు. దీని వల్ల నేరాల రేటు కూడా తక్కువుందన్నారు. సదస్సులో అదనపు జిల్లా న్యాయమూర్తి కె.రాధారత్నం, నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి షేక్ సికిందర్ భాషా, జిల్లా న్యాయసేవల సంస్థ కార్యదర్శి బీహెచ్‌వీ లక్ష్మికుమారి, జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేలూరి రఘురామ్ తదితరులు పాల్గొని, పలు అంశాలను వివరించారు.

ఆర్టీసీ బస్సు బోల్తా

- వంతెన గోడకు ఢీకొని బోల్తా- ఇద్దరికి గాయాలు



మండ గ్రామ సమీపంలోని మలుపు వద్ద బోల్తా పడిన ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు

గుమ్మలక్ష్మీపురం: ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సుకు దారిచ్చే క్రమంలో వంతెన గోడను ఢీకొట్టిన ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు బోల్తా పడిన సంఘటన గుమ్మలక్ష్మీపురం మండలంలో శనివారం చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళ్తే.. గుమ్మలక్ష్మీపురం నుంచి పార్వతీపురానికి ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు మండ గ్రామ సమీపంలోని మలుపు వద్దకు చేరుకోగా ఎదురుగా పార్వతీపురం నుంచి నీలకంఠాపురం వెళ్లేందుకు వస్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సుకు దారిచ్చే క్రమంలో కాస్త పక్కకు జరిపి నడపటంతో అక్కడి వంతెన గోడకు బలంగా ఢీకొంది. దీంతో పల్లెవెలుగు బస్సు అక్కడికక్కడే కుడిపైపు బోల్తా పడింది. ఈ సమయంలో బస్సులో డ్రైవర్, కండక్టర్‌తో పాటు 23 మంది ప్రయాణికులున్నారు. ప్రమాదంలో ప్రయాణికులు ఆరిక పావని, విజయశాంతి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యసేవలందించారు. ఈ సమాచారం తెలుసుకున్న పార్వతీపురం ఆర్టీసీ డీఎం దుర్గా సంఘటన స్థలానికి చేరుకొని బోల్తా పడిన ఆర్టీసీ బస్సును పరిశీలించారు. ప్రయాణికుల యోగక్షేమాలపై ఆరా తీశారు. తహసీల్దార్ జె.రాములమ్మ, ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, ఎస్ఐ షణ్ముఖరావు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆర్టీసీ బస్సు ప్రధాన రహదారి మధ్యలో పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలగకుండా జేసీబీ సాయంతో పక్కకు నెట్టివేయించారు. ఇదే బస్సు ఎడమ వైపున గల గెడ్డలో (లోయలో) పడి ఉంటే పెను ప్రమాదమే జరిగి ఉండేదని స్థానికులు చెబుతున్నారు.

లారీ బోల్తా - డ్రైవర్ మృతి

పాచిపెంట: మండలంలోని పి.కొనవలస జాతీయ రహదారి ఘాట్‌రోడ్డుపై శనివారం ప్రమాదం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాలు.. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నుంచి క్రేన్‌కు సంబంధించిన మెటీరియల్‌తో ఓ లారీ ఖుర్దా వెళ్తుండగా పి.కోనవలస జాతీయ రహదారి ఘాట్ రోడ్డుపై అదుపు తప్పి బండరాయిని ఢీకొని బోల్తా పడింది. డ్రైవర్ అభయ్ సాహుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108తో సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ డ్రైవర్ అభయ్‌సాహు మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు


స్క్రాప్ సామగ్రి దగ్ధం

విజయనగరం క్రైమ్: స్థానిక లోయర్ ట్యాంక్ బండ్ రోడ్డులో ఎల్ఐసీ కార్యాలయం పక్కన ఉన్న నిల్వలున్న స్క్రాప్ సామగ్రి శనివారం మధ్యాహ్నం దగ్ధమైంది. టైర్లు, ప్లాస్టిక్ సామగ్రి కాలిపోతుండడం చూసిన ప్రయాణికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారమందించారు. దీంతో రంగంలోకి దిగిన అగ్నిమాపక శాఖ ఏడీఎఫ్ఓ సోమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సుమారు రెండు గంటల పాటూ రెండు వాహనాలతో నీటిని పంపించి మంటలను చల్లార్చారు. షార్ట్ సర్క్యూట్ కానీ, ఎవరైనా మలమూత్ర విసర్జనకు వెళ్లి సిగరెట్ వంటివి విసిరేసారా అనేది తెలియాల్సి ఉంది. అయితే సుమారు లక్ష వరకూ ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని నిర్వాహకులు అంచనా వేశారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర శివారున శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో నలుగురు గాయాల పాలయ్యారు. మధ్యాహ్నం ఎస్.కోట వైపుగా వస్తున్న కారు ఆవును ఢీకొట్టిన ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు గాయాల పాలయ్యారు. వీరిని ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం కాలు విరిగిన బి.రాము అనే యువకుడిని విజయనగరం మహారాజ ఆస్పత్రికి రిఫర్ చేశారు. మరో ఇద్దరు యువకులు తులసీరావు, సిద్ధ, యువతి ధన్యలకు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు ఎస్.కోట పోలీసులు తెలిపారు.

గురుదేవా ట్రస్టు సేవలు ప్రశంసనీయం



దివ్యాంగులకు ఉపకరణాలు అందిస్తున్న మురళీధర్

కొత్తవలస రూరల్: దివ్యాంగుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్న గురుదేవా చారిటబుల్ ట్రస్టు సేవలు ప్రశంసనీయమని కాకినాడ సీ పోర్ట్స్ సీఈఓ మెర్ల మురళీధర్ కొనియాడారు. కొత్తవలస మండలం మంగళపాలెం గ్రామంలో ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఆధ్వర్యంలో కాకినాడ సీ పోర్ట్స్ సంస్థ ఆర్థిక సహకారంతో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాళ్లు, చేతులు కోల్పోయిన లక్షలాది మంది అభాగ్యులకు అండగా నిలుస్తూ జగదీష్‌బాబు దేవుడయ్యారని అభినందించారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ట్రస్టు సేవల్లో భాగంగా కాకినాడ సీ పోర్ట్స్ సంస్థ ద్వారా రూ.25 లక్షల విరాళం అందించారని తెలిపారు. అనంతరం 200 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు, చెవిటి మిషన్లు, వీల్‌చైర్స్, అంధులకు బ్లైండ్ స్టిక్స్ తదితర ఉపకరణాలను పంపిణీ చేశారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹ 190